ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 172 | సోమవారం 23 మార్చి 2026 | పేజీలు - 6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుండి 8.30 వరకు
సా.4 గం.నుండి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుండి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

హోర్ముజ్‌పై శత్రు నౌకలకు
## నో ఎంట్రీ

- అమెరికా గడువు హెచ్చరికలతో పెరుగుతున్న ఉద్రిక్తత..
- నాలుగో వారానికి చేరుకున్న యుద్ధం..
- ప్రపంచ చమురు రవాణాపై తీవ్ర ప్రభావం..
- శత్రుదేశాల నౌకలకు మాత్రమే ఆంక్షలు కొనసాగింపు..
- ఇతర దేశాలకు ఇరాన్ ఊరట నిర్ణయం..
- అంతర్జాతీయ వేదికపై పరస్పర ఆరోపణలు...



**వాషింగ్టన్ (తెలుగోడు), మార్చి 22 :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా ప్రారంభించిన యుద్ధం నాలుగో వారానికి చేరుకున్న వేళ పరిస్థితులు మరింత ఉత్కంఠభరితంగా మారాయి. ఇరాన్‌ను మడతపెట్టాలన్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో అమెరికాపై అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంత దేశాలతో పాటు ఇతర ప్రపంచ దేశాలకు కూడా ఇరాన్ తన సత్తా చాటుతోంది. ఈ నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని తెరవాలని అమెరికా గట్టి హెచ్చరికలు (మిగతా 2లో)




## మోడీ నెంబర్ 1
### నిరవధిక పాలనలో రికార్డు

- పూర్వ రికార్డును అధిగమించిన నాయకుడు
- రాష్ట్రం నుంచి కేంద్రం వరకు సుదీర్ఘ ప్రయాణం..
- అభివృద్ధి అజెండాతో ప్రత్యేక గుర్తింపు..
- వరుస విజయాలతో రాజకీయ ఆధిపత్యం..
- కాంగ్రెసేతర నేతగా అరుదైన ఘనత..
- మూడోసారి అధికారంలో కొనసాగుతున్న నాయకుడు..
- దేశ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం..
- దీర్ఘ కాల అనుభవంతో పరిపాలనా పటిమ

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 22 :** దేశ రాజకీయ చరిత్రలో మరో అరుదైన ఘట్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నమోదు చేశారు. ఎలాంటి విరామం లేకుండా వరుసగా 8,931 రోజుల పాటు ప్రభుత్వాధిపతిగా కొనసాగిన నాయకుడిగా ఆయన కొత్త రికార్డు సృష్టించారు. ఈ గణాంకం ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి పదవీకాలం నుంచి ప్రస్తుత ప్రధానమంత్రి బాధ్యతల వరకు కొనసాగిన సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని ప్రతిబింబిస్తోంది. ఇంతకాలం నిరవధికంగా అధికారంలో కొనసాగడం భారత రాజకీయాల్లో అరుదైన విషయం కావడం విశేషం.ఇప్పటివరకు ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. ఆయన 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించారు. అయితే మోదీ తాజాగా ఆ సంఖ్యను దాటుతూ ఒక రోజు ఎక్కువగా అధికారంలో కొనసాగి కొత్త మైలురాయిని అధిరోహించారు. దీంతో దేశంలో అత్యంత దీర్ఘకాలం ప్రభుత్వాధిపతిగా ఉన్న నాయకుడిగా నిలిచారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ, రాష్ట్ర పరిపాలనలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలం అదే పదవిలో కొనసాగుతూ అభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలు అమలు చేశారు. ఆ తరువాత 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అప్పటి 2లో

నేడు ఉక్కు ప్రాజెక్ట్‌కు
## శంకుస్థాపన



- రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడి..
- లక్ష మందికి ఉపాధి అవకాశాలు..
- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యం..
- క్యాప్టివ్ పోర్టుతో మరో 6 వేల ఉద్యోగాలు..
- విశాఖ ఆర్థిక ప్రాంతానికి కొత్త దిశ..
- నేడు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు..

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చే భారీ ఉక్కు ప్రాజెక్టుకు నాంది పలకనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి మార్చి 23న అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థ ప్రతిష్ఠాత్మక గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేయనున్నారు.ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు తయారీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పడనున్న ఈ కర్మాగారం వార్షికంగా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. మొత్తం రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు అమలుకానుండగా, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించ నున్నాయి. మొత్తం 5,465 ఎకరాల్లో విస్తరించనున్న ఈ ప్రాజెక్టును రెండు దశల్లో (మిగతా 2లో)

గరికపాటి వ్యాఖ్యలపై
## దుమారం



- మధ్యాహ్న భోజనంపై అభ్యంతరకర వ్యాఖ్యలపై ఆగ్రహం
- పథకం హక్కు.. విలాసం కాదని స్పష్టం..
- పేదల్ని కించపరిచేలా వ్యాఖ్యలపై మండిపాటు...

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పై ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయన వ్యాఖ్యలపై ఒక వర్గం ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని భావిస్తుండగా, మరికొందరు మాత్రం ఉపయోగించిన భాష అభ్యంతరకరమని తీవ్రంగా మండిపడుతున్నారు. గరికపాటి స్థాయికి తగిన విధంగా ఆ వ్యాఖ్యలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి స్పందిస్తూ, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం రాజకీయ నిర్ణయం కాదని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఇది హక్కుగా అమలవుతోందని తెలిపారు. ఈ పథకం గురించి పూర్తి అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి వ్యాఖ్యలు వచ్చి ఉండవచ్చని, వాటిని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. మధ్యాహ్న భోజనం పిల్లల జన్మహక్కు అని, ఇది విలాసం కాదని ఆయన తేల్చిచెప్పారు. ప్రతి పౌరుడికి గౌరవప్రదంగా జీవించే హక్కు ఉందని, అందులో పోషకాహారం కూడా భాగమని గుర్తు చేశారు. కడుపు ఖాళీగా ఉంటే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టలేరని, అందుకే ఈ పథకం అత్యంత అవసరమని వివరించారు. మధ్యాహ్న భోజన పథకం లేకుండా విద్య హక్కు చట్టం లక్ష్యం నెరవేరదని పేర్కొన్నారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయని, వ్యయంలో పెద్ద భాగం కేంద్రం భరిస్తుండగా మిగతా భాగాన్ని రాష్ట్రం అందిస్తున్నట్లు తెలిపారు. పథకం అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిషన్ కూడా పనిచేస్తోందని చెప్పారు. పిల్లల పోషకాహారం కోసం (మిగతా 2లో)

## పట్టుకున్న బోట్లే వదిలిపెట్టారు!



- మత్స్యకారులపై కూటమి నిర్లక్ష్యం.. మత్స్యకార గ్రామాలకు అన్యాయం..
- మత్స్య కారుల హక్కులను కాపాడేందుకు పోరాడుతాం..
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి..

**నెల్లూరు (తెలుగోడు), మార్చి 22 :** "ప్రాణాలకు తెగించి పట్టుకున్న బోట్లను వదిలిపెట్టడమేంటిది? మత్స్యకారుల కష్టానికి ఇదే ప్రతిఫలమా?" అంటూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమిళనాడు నుంచి అక్రమంగా వచ్చి రాష్ట్ర జలాల్లో మత్స్య సంపదను దోచుకుంటున్న బోట్లను స్థానిక మత్స్యకారులు ప్రాణాలను పణంగా పెట్టి పట్టుకున్నప్పటికీ, అధికారుల ఆదేశాలతో వాటిని తిరిగి విడుదల చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నెల్లూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "నాలుగు బోట్లను మత్స్యకారులు ఎంతో సాహసంతో అదుపులోకి తెచ్చారు. అలాంటి సందర్భంలో ప్రభుత్వ యంత్రాంగం ఒక్కసారిగా జోక్యం చేసుకుని వాటిని వదిలిపెట్టడం యాదృచ్ఛికం కాదు. ఇది ముందుగానే ప్రణాళిక ప్రకారం జరిగిన చర్య" అని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని, అవి బయటకు వస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు. "మత్స్యకారుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం... అక్రమంగా చేపలు పట్టేవారికి సహకరిస్తోంది. ఇది ఎంత వరకు సమంజసం?" అంటూ ప్రశ్నించారు. "మత్స్య సంపదను (మిగతా 2లో)

నేటినుంచి ఇంటర్
## మూల్యాంకనం

- ఏప్రిల్ రెండో వారంలో ఫలితాల విడుదలకు కసరత్తు..
- రాష్ట్రవ్యాప్తంగా 25 కేంద్రాల్లో మూల్యాంకనం ఏర్పాట్లు..
- చేతిరాత బాగలేదని మార్కులు తగ్గించరాదు..
- సమాధానాల నాణ్యత ఆధారంగానే మూల్యాంకనం..



**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేయగా, రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లా కేంద్రాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 25వ తేదీతో ఇంటర్ పరీక్షలు పూర్తికానుండగా, వెంటనే మూల్యాంకన ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్, సెకండీయర్ పరీక్షలకు మొత్తం 10,57,312 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ రెండో వారంలో విడుదల చేయాలనే లక్ష్యంతో మూల్యాంకన ప్రక్రియను చేపట్టారు. ఇందుకోసం ప్రతి కేంద్రంలో అవసరమైన సిబ్బందిని నియమించి, పత్రాల పంపిణీ, భద్రత వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మూల్యాంకన విధానంలో భాగంగా ప్రతి లెక్చరర్‌కు రోజుకు 30 జవాబు పత్రాలను కేటాయిస్తున్నారు. ఉదయం 15, మధ్యాహ్నం (మిగతా 2లో)

టిటిడి ఛైర్మెన్‌తో రాజీనామా చేయించడానికి
## ప్రభుత్వానికి భయమా

- పలు ఆరోపణలు ఎదుర్కుంటున్న వ్యక్తి ఛైర్మన్‌గా ఉండకూడదని మండిపాటు..
- పవిత్రత కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ..
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేసిన సిపిఐ నేత నారాయణ..



**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :** టీటీడీ ఛైర్మన్ వ్యవహారంపై సీపీఐ నేత నారాయణ నేరుగా విమర్శలు గుప్పించారు. పవిత్ర ఆలయాన్ని శుద్ధి చేస్తారని ఆశించామని, కానీ అలాంటి పరిస్థితి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తులు టీటీడీ ఛైర్మన్ పదవిలో కొనసాగడం తగదని స్పష్టం చేశారు. ఛైర్మన్‌ను రాజీనామా చేయమని ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, దానిలో ఎలాంటి రాజీ ఉండకూడదని హెచ్చరించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై స్పందిస్తూ యుద్ధం ప్రపంచ మానవాళిపై భారంగా మారుతోందన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే యుద్ధాలు జరుగు తున్నాయని ఆరోపించారు. ఆయిల్ వనరులను స్వాధీనం చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా దేశాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అణుబాంబుల పేరుతో దాడులు చేసి వాస్తవానికి ఆయిల్ కోసం యుద్ధాలు సాగిస్తున్నారని అన్నారు. ప్రపంచ రాజకీయ పరిణామాలు భారతదేశంపై కూడా ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్యత లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోందన్నారు. యుద్ధాల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడుతోందని తెలిపారు. డాలర్ (మిగతా 2లో)

హైదరాబాద్‌ను మించి
## అమరావతి

- అత్యాధునిక సాంకేతికతతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం..
- కృత్రిమ మేధ, డేటా రంగాల్లో ఏపీకి కొత్త దిశ..
- హైదరాబాద్ అభివృద్ధిలో తన పాత్రను గుర్తుచేసుకున్న సీఎం చంద్రబాబు..



**హైదరాబాద్ (తెలుగోడు), మార్చి 22 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిని హైదరాబాద్ నగరాన్ని మించేలా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అమరావతిని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గచ్చిబౌలిలో జరిగిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అభివృద్ధిలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. 1990లలో ఇంటర్నెట్ ప్రారంభమై, 1995 తర్వాత నాలెడ్జ్ ఎకానమీ రూపుదిద్దుకుందని గుర్తు చేశారు. ఆ దశలోనే సాంకేతికత ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ముందడుగు వేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో తన పాత్రను వివరిస్తూ, ఐటీ కంపెనీలను తీసుకురావడానికి చేసిన కృషిని వివరించారు. విదేశీ సంస్థలను ఆకర్షించేందుకు వ్యక్తిగతంగా ప్రయత్నాలు చేసినట్లు చెప్పారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా నగరాన్ని ప్రపంచ పటంలో నిలిపినట్లు పేర్కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం (మిగతా 2లో)

# హైదరాబాద్‌ను మించి అమరావతి



(మొదటి పేజి (తరువాయి)

నిర్మాణం కోసం వేల ఎకరాల భూమిని సేకరించామని, తాగునీటి సమస్యను తక్కువ కాలంలో పరిష్కరించామని తెలిపారు. 1999 నుంచి 2004 వరకు నగరాభివృద్ధికి వేగం తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. జీవసాంకేతిక రంగంలో కీలక ప్రాజెక్టుల ఏర్పాటులో కూడా తన కృషి ఉందన్నారు.రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ, 2004లో అధికారాన్ని కోల్పోయినప్పటికీ అభివృద్ధి దిశలో ఆలోచనలను కొనసాగించామని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అయితే 2019 నుంచి 2024 మధ్య రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రస్తుతం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, అంతరిక్ష సాంకేతికత, డ్రోన్లు వంటి రంగాల్లో వేగంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. విద్యుత్ రంగంలో సమస్యలను అధిగమించి మిగులు స్థాయికి చేరుకున్నామని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో దక్షిణాదిలో అగ్రస్థానంలో ఉన్నామని స్పష్టం చేశారు. సమగ్ర అభివృద్ధి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, అమరావతిని హైదరాబాద్‌ను మించేలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి మరోసారి వెల్లడించారు.

# మోడీ నెంబర్ 1

(మొదటి పేజి (తరువాయి)

నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగుతోంది.ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా మోదీ పలు కీలక నిర్ణయాలు తీసుకుని దేశ పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. పరిపాలనా సామర్థ్యం, ఎన్నికల విజయాలు, దీర్ఘకాల అధికారంలో కొనసాగడం వంటి అంశాల్లో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యమంత్రిగా అత్యధిక కాలం పనిచేసిన నాయకుడిగా, అదే సమయంలో ప్రధానిగా కూడా సుదీర్ఘ కాలం కొనసాగుతున్న నేతగా మోదీ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.స్వాతంత్ర్యానంతరం జన్మించి అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన కాంగ్రెసేతర తొలి నాయకుడిగా కూడా మోదీ నిలిచారు. కేంద్రంలో వరుసగా రెండు సార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తి చేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నేతగా మరో రికార్డును నమోదు చేశారు. ఈ విజయాలు దేశ రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యతను మరింతగా పెంచాయి.భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న నాయకుడిగా మోదీ రెండో స్థానంలో నిలిచారు. ఈ క్రమంలో ఆయన రాజకీయ ప్రయాణం, పరిపాలనా అనుభవం దేశ రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తోంది.దేశవ్యాప్తంగా మోదీ నాయకత్వంపై విస్తృత చర్చ కొనసాగుతోంది. అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా సంస్కరణల వంటి అంశాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు అనేక వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అదే సమయంలో విమర్శలు, ప్రశంసలు రెండూ ఆయన ప్రయాణంలో భాగమయ్యాయి.మొత్తంగా చూస్తే, 8,931 రోజుల నిరంతర పరిపాలనతో మోదీ సృష్టించిన ఈ రికార్డు భవిష్యత్తులో మరో నాయకుడు అధిగమించడం సులభం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీర్ఘకాలం అధికారంలో కొనసాగడం వెనుక ఉన్న వ్యూహాలు, ప్రజా మద్దతు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలు ఆయన విజయానికి కీలకంగా నిలిచాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ట

# పట్టణ డెయిరీలకు చార్జీల మాఫీ

## పశుపోషకులకు భారీ ఊరట... లైసెన్స్ ప్రక్రియ సులభతరం



**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాడి పశువులను పోషించే వారికి, చిన్న తరహా డెయిరీలను నిర్వహించే వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పట్టణ ప్రాంతాలలో పశుపోషణను ప్రోత్సహించడంతో పాటు రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించే ఉద్దేశంతో బెటర్మెంట్ మరియు డెవలప్మెంట్ చార్జీలను పూర్తిగా రద్దు చేసింది. ఈ నిర్ణయం పశు పోషకులకు, ముఖ్యంగా చిన్న తరహా డెయిరీ యాజమాన్యాలకు గణనీయమైన ఉపశమనాన్ని కలిగించనుంది.రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఈ నిర్ణయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ జారీ చేసిన జీవో ప్రకారం పట్టణ, స్థానిక అభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న డెయిరీలు, గొర్రెలు, మేకలు, పందుల యూనిట్లు మరియు ఇతర పశుసంవర్ధక ఫారాలకు ఈ చార్జీల నుంచి పూర్తి మినహాయింపు వర్తించనుంది. పశు సంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఈ నిర్ణయం వల్ల పట్టణ ప్రాంతాల్లో పశు పోషణపై ఆధారపడిన రైతులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వయం ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక స్థిరత్వానికి కూడా ఇది దోహదం చేస్తుందని తెలిపారు.భవన అనుమతులకు సంబంధించి కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫారాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన లైసెన్సు రుసుమును గ్రామపంచాయతీల స్థాయికి తగ్గిస్తూ పట్టణ ప్రాంతాల్లో కూడా సమానంగా అమలు చేయనుంది. ఈ చర్యతో పట్టణ పశుపోషకులకు మరింత సౌలభ్యం కలగనుంది.గతంలో మున్సిపాలిటీల పరిధిలో పశుపోషకులు అధిక డెవలప్మెంట్ చార్జీలు, షెడ్లకు అనుమతుల విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తాజా నిర్ణయంతో లైసెన్సు ప్రక్రియ సులభతరం కావడంతో పాటు వారికి వేల రూపాయల వరకు ఆదా అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్టణ ప్రాంత పశుపోషకులకు నిజమైన ఊరటనిచ్చే చర్యగా నిలుస్తోంది.

# సత్యసాయి జిల్లాలో 'ఆపరేషన్ వజ్రప్రహార్'

## అన్ని పోలీస్ డివిజన్ల పరిధిలో విస్తృత సోదాలు




**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 22 :**

జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా తెల్లవారుజాము నుంచి అన్ని పోలీసు సబ్‌డివిజన్‌ల పరిధిలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ సోదాలు కొనసాగాయి.కదిరి, పెనుగొండ, పుట్టపర్తి సబ్‌డివిజన్‌లలోని పలు హాట్‌స్పాట్ ప్రాంతాల్లో డీఎస్పీలు శివన్నారాయణ స్వామి, నరసింగప్ప ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బృందాలు కలిసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానించిన ప్రాంతాలు, అద్దె ఇళ్లు, లాడ్జీలు, ఖాళీ భవనాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రౌడీషీటర్లు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ప్రజల వివరాలు, వాహనాల పత్రాలు పరిశీలించి అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పత్రాలు సక్రమంగా లేని 109 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 20 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల సరఫరాను అరికట్టే దిశగా ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, డ్రోన్ కెమెరాల సహాయంతో కూడా పర్యవేక్షణ కొనసాగించారు.సోదాల సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలను పూర్తిగా అరికట్టే దిశగా ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ తెలిపారు.

# బదిలీలలో సీనియారిటీకీ ప్రాధాన్యం

## శ్రీ సత్యసాయి జిల్లాలో పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీలు



**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 22 :**

శ్రీ సత్యసాయిజిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల బదిలీలు పారదర్శకంగా నిర్వహించామని జిల్లా ఎస్పీ తెలిపారు. నిబంధనలు, సీనియార్టీని ప్రామాణికంగా తీసుకుని బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో 190 మంది కానిస్టేబుళ్లకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. జిల్లాలోని ఐదు సబ్ డివిజన్ల పరిధిలో ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన సిబ్బంది జాబితాను సిద్ధం చేసి కౌన్సిలింగ్‌కు పిలిచారు. ముందుగా ఐదేళ్లు పూర్తి చేసిన సీనియార్టీ జాబితాను ప్రొజెక్టర్‌పై ప్రదర్శించారు. జిల్లాలో ఉన్న ఖాళీల వివరాలను కూడా అందులో చూపించారు. బదిలీలకు సంబంధించిన నిబంధనలను స్పష్టంగా వివరించిన అనంతరం సీనియార్టీ ఆధారంగా ఒక సబ్ డివిజన్ నుండి మరొక సబ్ డివిజన్‌కు సిబ్బంది కోరుకున్న ప్రాంతాలకు బదిలీలు చేశారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా జరగడంతో సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకిత సురాన , ఏవో వేణుగోపాల్, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ నాగరాజు, డిపిఓ సిబ్బంది మస్తాన్, సూర్యతేజ పాల్గొన్నారు.

**జిల్లాలోని పలు స్టేషన్లలో పాత నేరస్తులకు కౌన్సిలింగ్**


జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆదివారం పాతనేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా నేర జీవితానికి స్వస్థి పలికి సంతోషకరమైన జీవనాన్ని అలవర్చు కోవాలని పోలీస్ అధికారులు సూచించారు. క్షణికావేశంలో చేసిన నేరాల కారణంగా జీవితాంతం వాటి ప్రభావం పడుతూనే వుంటుందని నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లరాదని తెలిపారు.

# దార్శనిక నేత చంద్రబాబు

## రూ.1.47లక్షల కోట్ల స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి హాజరైన

## కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి..

## సిఎంగా చంద్రబాబు వుండటం రాష్ట్ర ప్రజల అదృష్టం



**విశాఖపట్నం (తెలుగోడు), మార్చి 22 :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి దార్శనికుడు రాష్ట్రానికి నాయకత్వం వహించడం ప్రజల అదృష్టమని కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో జరగనున్న భారీ ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన ఆదివారం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న వెంటనే భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరగడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు సీఎం చంద్రబాబు కృషి, దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిజంగా అదృష్టవంతులని పేర్కొన్నారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన విశాఖ ఉక్కు పరిశ్రమ హిల్‌టాప్ అతిథి గృహానికి చేరుకున్న ఆయన రాత్రికి అక్కడే బస చేయనున్నారు. సోమవారం ఉదయం సీఎం చంద్రబాబుతో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు.ఇదిలా ఉండగా, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో లక్సెంబర్గ్‌కు చెందిన ఆర్సెలార్ మిట్టల్ మరియు జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ సంస్థలు సంయుక్తంగా రూ.1,47,162 కోట్ల భారీ పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు ఇప్పటికే కుదిరాయి. మొదటి దశలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పనులు ప్రారంభించి, రెండో దశలో 10.5 మిలియన్ టన్నుల వరకు విస్తరించనున్నారు.ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త దిశ లభించనుండగా, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 60 వేల నుంచి 65 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు. రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేసే ఈ ప్రాజెక్టు, ఏపీ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.

# హార్ముజ్‌పై శత్రునౌకలకు నో ఎంట్రీ

(మొదటి పేజి (తరువాయి)

జారీ చేసింది. నిర్ణీత గడువులోగా మార్గాన్ని అందుబాటులోకి తేనిపక్షంలో విద్యుత్ కేంద్రాలపై దాడులు తప్పవని అమెరికా మాజీ అధ్యక్షుడు హెచ్చరించడం ఉద్రిక్తతను మరింత పెంచింది.

అయితే ఈ పరిణామాల మధ్య ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు హార్ముజ్ జలసంధిలో అన్ని నౌకల ప్రయాణాన్ని అడ్డుకుంటూ వచ్చిన ఇరాన్, ఇప్పుడు శత్రుదేశాలకు చెందిన నౌకలు మినహా మిగతా దేశాల నౌకలకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో గల్ఫ్ ప్రాంత దేశాలు, ఇతర దేశాలు కొంత ఊరట పొందాయి. ప్రపంచ చమురు రవాణాలో కీలక పాత్ర పోషించే ఈ జలమార్గంలో ఏర్పడిన ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం నెలకొన్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.సముద్ర భద్రతను మెరుగుపరచడంలో భాగంగా ఇతర దేశాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, తమ అధికారులతో సమన్వయం చేసుకుని సరైన భద్రతా చర్యలు తీసుకుంటే శత్రు నౌకలు మినహా మిగతా నౌకలు హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించవచ్చని వెల్లడించారు. ఈ పరిణామాలతో ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపిస్తున్నప్పటికీ, యుద్ధ వాతావరణం ఇంకా పూర్తిగా చల్లారలేదు.

# ఉక్కు ప్రాజెక్టుకు శంకుస్థాపన

(మొదటి పేజి (తరువాయి)

అభివృద్ధి చేయనున్నారు. తొలి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని ఏర్పరచనున్నారు. దీని ద్వారా రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తి రంగానికి విశేష ప్రోత్సాహం లభించనుంది.ఇదే ప్రాజెక్ట్‌కు అనుబంధంగా 316 ఎకరాల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.11,198 కోట్ల అదనపు పెట్టుబడి పెట్టబడనుండగా, దీని ద్వారా మరో 6 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ఏర్పాటుతో విశాఖపట్నం ఆర్థిక ప్రాంతం ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఎదగనుంది.ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను జాతీయ రహదారి 16తో అనుసంధానించేందుకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానుండగా, కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మరియు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. అలాగే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టీజీ భరత్, పార్లమెంట్ సభ్యుడు సి.ఎం. రమేష్ ప్రత్యేక అతిథులుగా హాజరవుతారు. ఉక్కు సంస్థ ప్రతినిధులుగా లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్ కూడా కార్యక్రమంలో పాల్గొననున్నారు.నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా రాజయ్యపేటకు చేరుకుని మధ్యాహ్నం 3.40 గంటలకు ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి అవగాహన ఒప్పందాలపై సంతక కార్యక్రమంలో పాల్గొని తిరిగి అమరావతికి బయలుదేరుతారు.

# గరికపాటి వ్యాఖ్యలపై దుమారం

(మొదటి పేజి (తరువాయి)

వారంలో ఐదు రోజులు గుడ్లు అందిస్తున్నారని, అలాంటి కార్యక్రమాలపై విమర్శలు రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఒక పూట భోజనం ఇవ్వకపోయినా, గుడ్డు అందించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే స్వయంగా కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.గరికపాటి చేసిన కొన్ని వ్యాఖ్యలు పేదలను, ప్రభుత్వ పాఠశాలలను కించపరిచేలా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. పేద పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తు చేశారు. గౌరవాన్ని నిలబెట్టేలా మాటలు ఉండాలని, అవమానకర వ్యాఖ్యలు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

# పట్టుకున్న బోట్లే వదిలిపెట్టారు

(మొదటి పేజి (తరువాయి)

దోచుకుంటున్న వారిని వదిలిపెట్టి, వారిని అడ్డుకున్న వారిపైనే ఒత్తిళ్లు తీసుకురావడం చూస్తుంటే ప్రభుత్వ ఉద్దేశాలు స్పష్టంగా అర్థమవుతున్నాయి" అని తీవ్రంగా విమర్శించారు.ఈ ఘటనతో జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో తీవ్ర ఆగ్రహం నెలకొన్నదని ఆయన తెలిపారు. "తమ సమస్యలను బయటపెడుతున్న మత్స్యకారులను బెదిరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని అన్నారు. స్థానికంగా మత్స్యకార సంఘాలు కూడా ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వంలో మత్స్యకారుల అభివృద్ధి కోసం చేపట్టిన హార్బర్ నిర్మాణాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కాకాని విమర్శించారు. "ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిలిపివేయడం, కొన్ని పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు చేయడం వెనుక వేరే ప్రయోజనాలున్నాయన్న అనుమానం కలుగుతోంది" అని అన్నారు "నెల్లూరు జిల్లాలో పోలీస్ ఆధారిత రాజకీయాలు నడుస్తున్నాయి. ప్రజల గొంతును అణచివేయాలనే ధోరణి పెరుగుతోంది" అని ఆరోపించారు.మత్స్యకారుల హక్కులను కాపాడే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన ఆయన, "అక్రమంగా వదిలిపెట్టిన బోట్లను తిరిగి యథాస్థితికి తీసుకురాకుండా మా పోరాటం ఆగదు. మత్స్యకారుల కోసం చివరి వరకు నిలబడతాం" అని హెచ్చరించారు.

# నేటినుంచి ఇంటర్ మూల్యాంకనం

(మొదటి పేజి (తరువాయి)

15 పత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. విద్యార్థుల జవాబులను పూర్తిగా చదివి, సమాధానాల నాణ్యత ఆధారంగా మాత్రమే మార్కులు ఇవ్వాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. చేతిరాత బాగాలేదనే కారణంతో మార్కులు తగ్గించకూడదని ప్రత్యేకంగా సూచించారు.

అలాగే మూల్యాంకనం పూర్తయ్యాక మరోసారి పునఃపరిశీలించి, మార్కులను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. మూల్యాంకనంలో నిర్లక్ష్యం వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొరపాట్లు చేసే వారికి రూ. 3 వేల నుంచి రూ. 7,500 వరకు, పరిశీలనలో లోపాలు ఉంటే రూ. 2 వేల నుంచి రూ. 3,750 వరకు జరిమానాలు విధిస్తామని తెలిపారు. మార్కుల్లో భారీ వ్యత్యాసాలు తలెత్తినట్లయితే సంబంధితులను మూల్యాంకనం నుంచి తొలగిస్తామని కూడా హెచ్చరించారు.మొత్తం మీద ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తి నెలకొంది.

# టిటిడి ఛైర్మెన్‌తో రాజీనామా చేయించేందుకు ప్రభుత్వానికి భయమా

(మొదటి పేజి (తరువాయి)

విలువ పెరగడం, ఆయిల్ ధరలు ఎగసిపడటం వల్ల సాధారణ ప్రజలపై భారంగా మారుతోందన్నారు. టూరిజం రంగం కూడా తీవ్రంగా దెబ్బతింటోందని చెప్పారు. యుద్ధం కొనసాగితే దేశం ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా ప్రభావితమవుతుందని హెచ్చరించారు.

ప్రపంచ శాంతి కోసం భారత్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధాలను ఆపేందుకు చొరవ తీసుకుని అంతర్జాతీయ వేదికలపై చర్చలు జరగాలని సూచించారు. నాయకులు ముందుకు వచ్చి శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

## దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి

**విశ్వహిందూ పరిషత్ సభ్యులు..**

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 22 :**

రాష్ట్రంలోని హిందూ దేవాలయాల అన్నింటికీ స్వయం ప్రతిపత్తిని కలగజేసేలా ఒక జీవో ం విడుదల చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు తాళంకి వెంకట రత్నమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా చిన్మయ మిషన్ స్వామి ఆత్మ విదానంద, పరిషత్ కార్యదర్శి విశ్వనాథ రెడ్డి, విహెచ్‌పి దక్షిణాది ప్రాంత కార్యదర్శి కోటేశ్వరరావు, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణప్రతి ఒక్క హిందువు బాధ్యత అని అన్నారు. అన్యమతస్తులు దేవాలయంలోనికి వెళ్లి ఆలయ ప్రతిష్టను దిగజారుస్తున్నారని అన్నారు. ఆలయ కమిటీ పేర్లతో రాజకీయం చేస్తూ ఆలయాలకు వచ్చే ఆదాయాన్ని ప్రక్కదోవ పట్టిస్తున్నారన్నారు. ఆలయ పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 2025 జనవరి 5న విశ్వహిందూ శంఖారావం పేరుతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు వినతిపత్రం అందించామన్నారు. దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో ముసాయిల చట్టంపై అవగాహన కల్పించడం కోసం జిల్లాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలని రాజ్యాంగం సూచించారన్నారు. రాజకీయ నాయకులు స్వలాభం కోసం వాటిని పక్కనే పెట్టి హిందూ దేవాలయాల ప్రతిష్టను భంగపరుస్తున్నారన్నారు. ఇలాగే జరిగితే రాష్ట్రంలోని హిందువులందరూ ఒకటై విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉద్యమం చేసే రోజు దగ్గరలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెప్పించి రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు అయ్యేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్రబాబు , దేవీ రెడ్డి రాజేష్, హరీష్, రమణమూర్తి, రమణ బాబు, విజయ్ కుమార్, ఆళ్లగడ్డ రాము, జిల్లాలోని అర్చకులు, న్యాయవాదులు, వ్యాపారస్తులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సేవా సమితి, సభ్యులు, హిందూ కార్యకర్తలు పాల్గొన్నారు.





కనేకల్ నుండి హైదరాబాద్, బెంగళూరుకు నూతన బస్సు సర్వీసులు ప్రారంభించిన హనుమాన్ ట్రావెల్స్

## కనేకల్ నుండి హైదరాబాద్ బెంగళూరుకు స్లీపర్ ఏసీ బస్సులు

**ప్రారంభించిన హనుమాన్ ట్రావెల్స్..**

**కనేకల్ (తెలుగోడు), మార్చి 22:**

కనేకల్ ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా తీరని కోరికగా, అందని ద్రాక్షల ఉండే హైదరాబాద్, బెంగళూరుకు నేరుగా వెళ్లే బస్సు సౌకర్యాన్ని హనుమాన్ ట్రావెల్స్ సాకారం చేసింది. హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రయాణికుల కోరికను ఎర్రగుంట గ్రామానికి చెందిన హనుమాన్ ట్రావెల్స్ తీర్చింది. ఆదివారం నుండి నూతనంగా బస్సు సేవలు హనుమన్ ట్రావెల్స్ ప్రారంభించింది. దీంతో హైదరాబాద్‌కు వెళ్లాలన్న ప్రయాణికుల కల నేడు నెరవేరింది. కనేకల్ శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవస్థానం వద్ద రాత్రి 8.30 గంటలకు బస్సు ప్రారంభమైందిన. ఇది ఉరవకొండ, గుంతకల్, గుత్తి, డోన్, కర్నూల్ మీదుగా హైదరాబాద్‌లోని వనస్థలిపురం వరకు ప్రయాణం చేస్తుందని ట్రావెల్స్ యజమాని ముచ్చుమర్రి అభిరామ్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కు సిట్టింగ్ సీట్ 590 రూపాయలు స్లీపర్ 790 రూపాయలకు నిర్ధారించినట్లు తెలిపారు.ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని శనివారం ఆదివారం రోజు ధరల్లో మార్పులు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా బెంగళూరుకు సైతం ఇదే ట్రావెల్స్‌కు చెందిన బస్సు వెళ్తుందని ఈ బస్సు రాయదుర్గం, కళ్యాణదుర్గం, పావగడ మీదుగా బెంగళూరులోని చందాపూర్ వరకు వెళు_ుందన్నారు ఇందులో సిట్టింగ్ 490, స్లీపర్ 690 రూపాయలుగా నిర్ధారించారన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యం సద్వినియోగం చేసుకుని తమ ప్రయాణాన్ని సుఖవంతమైన ప్రయాణంగా మలుచుకోవాలన్నారు. ప్రయాణికులకు హనుమన్ ట్రావెల్స్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తేవాలని సమస్యను పరిష్కరించి ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం అందిస్తామన్నారు. ప్రయాణికులు ప్రయాణంతోపాటు లగేజ్ సౌకర్యం సైతం తమ ట్రావెల్స్ సౌకర్యం అందించింది అన్నారు. ఈరోజు నుంచి కనేకల్ ప్రజల ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న హైదరాబాద్ బెంగళూరు ప్రయాణం కల నేటితో నెరవేరింది అన్నారు. హైదరాబాద్ బెంగళూరుకు సౌకర్యవంతమైన బస్సులు ఏర్పాటు చేసిన హనుమాన్ ట్రావెల్స్ కు కనేకల్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ట్రావెల్స్ వల్ల తమ పిల్లల ప్రయాణం అనుకూలంగా ఉంటుందన్నారు.

## తలకూర ఉడకలేదని.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 22:**

తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఒక వింత ఘటన చోటుచేసుకుంది. స్థానిక పుట్లూరు రోడ్డుకు చెందిన సోడాల హాజీ ఉగాది పార్ణ సందర్భంగా పొట్టేలు తల కొనుగోలు చేసి, శుభ్రం చేయించి ఇంటికి తీసుకెళ్ళాడు. తల మాంసం కుక్కర్‌లో సుమారు 20 సార్లు ఉడికించినా ఉడకకపోవడంతో మాంసం విక్రయదారుడిని కలిసి మంచి తలకూర ఇవ్వాలేదని నిలదీశాడు. దీనికి అతడు స్పందించకపోవడంతో మాంసం విక్రయదారుడిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వండిన వంట కుక్కర్ పాత్రతో సహా స్టేషన్‌కు నేరుగా తీసుకెళ్లాగా, పోలీసులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చివరకు పోలీసులు అతనికి సర్ది చెప్పి తల కూర ధరకు సమానంగా మటన్ ఇప్పించడంతో సమస్య సద్దుమణిగింది. సామాన్య పౌరుడు తలకూర మంచిది ఇవ్వలేదని ధైర్యంగా పిర్యాదు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమని పట్టణ సీఐ ఆరోహణ రావు అన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారని పట్టణ సీఐ ఆరోహణ రావు తెలిపారు.



సీఐ ఆరోహణ రావు





పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సోడాల హాజీ. ఉడకని తలకూరను కుక్కర్ గిన్నెలో తెచ్చిన దృశ్యం

# ఆ గదుల అద్దె మాయం..!

**పంచాయతీ ఆదాయంతో 'వే'లాకో'లం'.. గదుల అద్దె బకాయిల వసూళ్లపై నీలినీడలు.. రూ. 1.72 కోట్ల ఆదాయం కోల్పోయిన యాడికి మేజర్ పంచాయతీ..**

**యాడికి (తెలుగోడు), మార్చి 22:**

ఒకప్పుడు జిల్లాలో కీలక పంచాయతీగా ఉన్న యాడికి మేజర్ పంచాయతీ తీరు ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది. చెప్పుకోవడానికి రూ. కోట్ల విలువైన అద్దెగదులు, ఆస్తులున్నా వాటి నుంచి నయాపైసా రావడం లేదు. పట్టణ నడిబొడ్డున, బస్టాండులో వ్యాపారవకాశాలు మెండుగా ఉన్న ప్రదేశంలో నిర్మించిన 24 అద్దె గదుల ద్వారా ఏడాదికి సుమారు రూ. 30 లక్షలు పంచాయతీకి ఆదాయం రావాల్సి ఉండగా పైసా వచ్చే పరిస్థితి లేకపోవడం విడ్డూరం. కుంట ముఖ ద్వారానికి ఎడమ వైపున్న 5 అద్దె గదులకు 10 ఏళ్లుగా పైసా అద్దె చెల్లించడం లేదు. కుంట ముఖద్వారానికి కుడి వైపున్న 5 అద్దె గదులకు గతేడాది మార్చితో మూడేళ్ల గడువు ముగిసినా తిరిగి వేలం నిర్వహించకపోవడం, అప్పటి నుంచి గదుల అనుభవదారులు చెల్లిస్తున్న అద్దెలు ఎవరి జేబులోకి పోతున్నాయో అర్థం కాని పరిస్థితి. ఇక స్పర్శ స్వచ్ఛంధ సంస్థ ఆర్థికసహాయంతో 2019లో నిర్మించి న వాణిజ్య సముదాయ భవనం అధికారుల పట్టింపులేని తనంతో ఏడేళ్లుగా ప్రారంభానికి నోచుకోక ఎదురు చూస్తోంది. ఇందులోని 14 గదులు వినియోగంలోకి వచ్చింటే ఏడాదికి సుమారు రూ. 17 లక్షలు ఆదాయం వచ్చేది. పాలక వర్గాల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి ఈ 24 అద్దె గదులకు ఈ 10 ఏళ్ల కాలంలో దాదాపు 1.72 కోట్ల ఆదాయాన్ని పంచాయతీ కోల్పోవాల్సి వచ్చింది.

***రూ. లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం..***

యాడికి బస్టాండులో అత్యంత సౌకర్యవంతమైన చోట రూ.60 లక్షలు వెచ్చించి స్పర్శ స్వచ్ఛంద సంస్థ 2019లో కింద, పైన కలిపి 14 గదులను నిర్మించి పంచాయతీ వరం చేసింది. అప్పటి నుంచి కోర్టులో నెలకొన్న వివాదానికి తెరదించడంలో అధికారులు చిత్తశుద్ధి చూపించకపోవడంతో నేటికీ ఈ భవన సముదాయం ఖరీదైన దిష్టిబొమ్మగా మిగిలిపోయింది. కోర్టు చుట్టూ తిరగడానికి పంచాయతీ నిధులు రూ. లక్షల్లో ఖర్చు చేశారే కాని సరైన శ్రద్ధ చూపలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సరైన కౌంటర్ దాఖలు చేయకపోవడం, న్యాయవాదులతో సమన్వయం లేకపోవడంతో ఏళ్లు గడుస్తున్నా రూ. లక్షలు వెచ్చించిన లక్ష్యం నీరుగారిపోతోంది. ఇందులోని ఒక్కో గది రూ. 10 వేలకు అద్దెకిచ్చినా ఏడాదికి రూ. 16.80 లక్షల వంతున ఇప్పటి వరకు ఏడేళ్లకు సుమారు రూ.1.17 కోట్ల ఆదాయం పంచాయతీకి సమకూరేది. ఇందులోని గదులను కొందరు నాయకుల పోటీపడి తమకు నచ్చినవారికి ఉచితంగా వాడుకోమంటూ తమ ఉదారతను చాటుకుంటున్నారే తప్ప వంచాయతీకి ఆదాయ మార్గంగా మలచడంలో మాత్రం శ్రద్ధ చూపకపోవడం గమనార్హం.

***10 ఏళ్లుగా ధరావతుతోనే ధారాళంగా..!***



ఏడేళ్లుగా ప్రారంభానికి ఎదురుచూస్తున్న పంచాయితీ గదుల సముదాయం

కుంట ముఖద్వారానికి ఎడమవైపున్న 5 పంచాయతీ గదుల సముదాయానికి నిర్మాణ సమయంలో (2005లో వేలం పాటలో దక్కించుకున్న ఐదుగురు వేలంపాటదారులు ఒక్కో గదికి రూ. 3.70 లక్షల నుంచి రూ.4.20 లక్షలవరకు ఏక మొత్తం లో చెల్లించి ఏడాదికి రూ. వెయ్యి వంతున ప్రతి ఏటా 30 శాతం పెంపుతో అద్దెకు దక్కించుకున్నారు. తమకు 20 ఏళ్ల కాలపరిమితి అనే నిబంధన విధించారు కాబట్టి ఆ మేరకు ఒప్పందం కుదిరితేనే రూ. వెయ్యి అద్దె, 30 శాతం పెంపు అనే నిబంధనకు అంగీకరిస్తామని మెలికపెట్టి పంచాయతీకి 10 ఏళ్లుగా ఒక్క రూపాయి కూడా అద్దె చెల్లించడం లేదు. ఆ లెక్కన ఈ అయిదు గదులకు కనీసం రూ.8 వేలు వంతున లెక్కేసినా ఇప్పటి వరకు రూ.48 లక్షల ఆదాయం పంచాయతీకి దక్కేది.

***ఎదురు గదులకు వేలం వేస్తేనే వీటికి వేలం వేయండి..***

కుంట ముఖద్వారానికి కుడివైపున్న 5 అద్దెగదులకు గతేడాది మార్చితో మూడేళ్ల గడువు ముగిసింది. దీంతో పంచాయతీ అధికారులు తిరిగి వేలం వేయడానికి పూనుకోగా కొందరు పాలకవర్గం సభ్యులు కుంట ముఖద్వారానికి ఎడమవైపున్న గదులకు వేలం నిర్వహిస్తేనే వీటికి వేలం నిర్వహించాలని, లేకుంటే వీలు లేదని పట్టుపట్టారు. ఫలితంగా ఏడాదిగా ఈ అయిదు గదుల్లో ఒక గదికి మాత్రమే అద్దె వస్తుండగా 4 గదులకు అద్దె రావడమే లేదు. ఈ 4 గదులకు ఏడాదిగా రావాల్సిన దాదాపు రూ.7.20 లక్షలు అనుభవదారులు చెల్లిస్తున్నా పంచాయతీకి చేరకపోవడం విశేషం. అద్దె వసూళ్లలో రాజకీయ జోక్యం చేసుకోవడంతో పెద్ద ఎత్తున నిధులు దారి మల్లుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వేలం లేకపోవడం, వాణిజ్య భవనం వినియోగంలోకి రాకపోవడంతో భారీగా పంచాయతీ ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. అద్దె గదుల వేలం. అద్దెల వసూళ్లు పక్కాగా నిర్వహించి పంచాయతీ ఆదాయాన్ని పెంచి తద్వారా పంచాయతీ అభివృద్ధికి అటు పాలక వర్గం, ఇటు పంచాయతీ అధికారులు పాటుపడాల్సిన అవసరం ఉందని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.





అద్దె చెల్లించని గదులు. 10 ఏళ్లుగా ధరావతుతోనే గదుల్లో కొనసాగుతున్న దుకాణాలు



ప్రవచనాలు చెబుతున్న డాక్టర్ ప్రఫుల్ల

## సమాజంలో తండ్రి పాత్రకు ఎంతో విశిష్టత

**విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ ప్రఫుల్ల..**

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 22 :**

శ్రీ రామాయణంలో తండ్రికి ఎంతో విశిష్టత కల్పించారని విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ ప్రఫుల్ల పేర్కొన్నారు. శారదానగర్‌లోని శ్రీ శృంగేరి శంకరమఠంలో రామాయణాంతర్గత అయోధ్యకాండ ప్రవచన 3 వ రోజు అయోధ్యకాండకు వెళ్లే ముందు అయోధ్యలో రామునితో కైకేయి తండ్రి తల్లి బాధ్యతలు, గొప్పతనాన్ని వివరించి చెప్పారన్నారు. తండ్రి దశరథ మహారాజు గొప్పతనాన్ని వివరిస్తూ ప్రజల పట్ల రాజు ఎలా మెలగాలి అని చెప్పారన్నారు. తల్లి యొక్క విశిష్టతను వివరిస్తూ వనవాసానికి వెళ్తున్న సీతా రామలక్ష్మణులతో తల్లిదండ్రుల యొక్క ఆవేదన కళ్లకు కట్టినట్టుగా వివరించారన్నారు.



## రేషన్ షాపుల్లో మళ్లీ కిరోసిన్ పంపిణీ

**సోమవారం నుంచి లీటరు చొప్పున కిరోసిన్ పంపిణీ మంత్రి నాదెండ్ల మనోహర్..**

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**

ప్రస్తుతం గ్యాస్ కొరత నేపథ్యంలో కేంద్రం కేటాయించిన 2800 కిలో లీటర్ల కిరోసిన్‌ను వచ్చే సోమవారం నుంచి రేషన్ ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో లీటరు చొప్పున పంపిణీ చేయనున్నట్టు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతల ప్రభావంతో విశాఖపట్నానికి ఈ నెల 21వ తేదిన రావాల్సిన గ్యాస్ నౌక 26వ తేదీన చేరనున్నట్టు కేంద్రం సమాచారం ఇచ్చిందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అప్పటి వరకు సరఫరాలో అంతరాయం లేకుండా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు.

## శింగనమల క్రాస్‌లో నేడు చలివేంద్ర ప్రారంభం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 22 :**

శింగనమల క్రాస్‌లో సోమవారం ఉదయం 10:45 గంటలకు శ్రీ ఋషి శృంగ మహాముని , గంపమాలయ స్వామి వారి ఆశీస్సులతో చలివేంద్రం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఋషి శృంగ మహాముని ట్రస్టు సభ్యులు జే రామ్ చరణ్ యాదవ్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల శింగనమల క్రాస్ లో ప్రయాణికులు కోసం త్రాగు తాగునీటి చలివేంద్రం ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రయాణికులు సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో టైం పడుతుందని అక్కడ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, అలాగే ప్రయాణికులు ఎండ తీవ్రత కు సెగ తీరడానికి కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శింగనమల అధికారులు హాజరు కారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## టీసీ రాజన్ మరణంపై వైయస్ జగన్ సంతాపం

**తాడేపల్లి, (తెలుగోడు), మార్చి 22 :**

ప్రముఖ గాంధేయవాది, మాజీ ఎమ్మెల్యే ఠానేదార్ చిన్న రాజన్ (టీసీ రాజన్) మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పలమనేరు నియోజకవర్గం నుంచి 1967లో స్వతంత్ర పార్టీ తరపునఎమ్మెల్యేగా గెల్చిన టీసీ రాజన్‌గారు విలువలకు కట్టుబడి ఉన్న వ్యక్తి అని, ఆచార్య ఎన్జీ రంగా అనుచరుడిగా ఉంటూ, స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని.. ఎమ్మెల్యేగా గెల్చి ఆ పదవికే వన్నె తెచ్చారని శ్రీ వైయస్ జగన్ తెలిపారు. జీవితాంతం నిజమైన గాంధేయవాదిగా నిల్చిన టీసీ రాజన్‌గారు నిస్వార్థ రాజకీయనేతగా ప్రజాసేవకే అంకితం అయ్యారని గుర్తు చేశారు. నిండు నూరేళ్లు జీవించిన టీసీ రాజన్‌గారు, రాష్ట్ర రాజకీయాల్లో చిరస్మరణీయుడని పేర్కొన్న శ్రీ వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**తెలుగు నేలలో లభించిన అరుదైన**

# బుద్ధానంద శాతకర్ణి నాణెం

**క్రీ.శ 290 నుండి క్రీ. శ 330 మధ్య కాలం నాటిది.. కానిస్టేబుల్ విష్ణు భగవాన్ సేకరణ..**

**యాడికి (తెలుగోడు), మార్చి 22:**

శాతవాహన సామ్రాజ్యం పతనమైన తరువాత ఆనంద గోత్రజ అనే రాజవంశం గుంటూరు ప్రాంతానికి కేంద్రంగా చేసుకొని పాలించింది. వీరి రాజధాని కందరపురం. ప్రస్తుత గుంటూరు జిల్లాలోని చేజర్ల లేదా కంతేరు అని చరిత్రకారుల అభిప్రాయం.

భారతదేశ చరిత్రలో ఇలాంటి నాణేలు చాలా అరుదుగా కనిపిస్తాయి ఒక అజ్ఞాత రాజు ఉనికిని చాటిచెబుతాయి. రాయలసీమ కాయిన్స్ సొసైటీ సెక్రెటరీ కానిస్టేబుల్ విష్ణు భగవాన్ సేకరణలోకి వచ్చి చేరింది ఈ అరుదైన నాణెం . ఈ నాణెం కేవలం డబ్బు మాత్రమే కాదు, ఆ రాజు యొక్క అధికారాన్ని మరియు మతాన్ని సూచిస్తుంది.

వృషభం ఇది సాధారణంగా శివుని వాహనంగా భావిస్తారు, కానీ శాతవాహన కాలంలో ఇది శక్తి, వ్యవసాయ సమృద్ధికి ఒక ప్రత్యేక చిహ్నం. చైత్యం/కొండ ఇది బౌద్ధ స్తూపాన్ని లేదా రాజ్యాధికారాన్ని సూచిస్తుంది. దీనిపై చంద్రవంక ఉంటే అది మరింత పవిత్రంగా భావించబడుతుంది. విల్లు మరియు బాణం ఇది పశ్చిమ భారతదేశం మరియు కర్ణాటక ప్రాంతాల్లోని చుటు-శాతకర్ణుల ప్రత్యేక గుర్తు ఇది వారి యుద్ధ నైపుణ్యాన్ని సూచిస్తుంది.



రాయలసీమ కాయిన్స్ సొసైటీ సెక్రెటరీ కానిస్టేబుల్ విష్ణు భగవాన్

బుద్ధానంద శాతకర్ణి ఒక ప్రత్యేక రాజు. చరిత్రలో చుటుకులానంద, ముదానంద, శివలానంద వంటి పేర్లు కనిపిస్తాయి వీరి అందరి పేర్ల చివర 'నంద' అని ఉండటం వల్ల వీరిని "ఆనంద వంశీయులు" అని పిలుస్తారు.



తెలుగు నేలలో లభించిన అరుదైన బుద్ధానంద శాతకర్ణి కాలం నాటి నాణెం

***బుద్ధానంద..***

ఈ పేరు ఉన్న నాణేము భారతదేశ చరిత్రలో ఇదే మొదటిసారి శాతకర్ణి అనే పదం శాతవాహన సామ్రాజ్యం అంతరించినా, వారి పేరుకు ఉన్న గౌరవం వల్ల తర్వాత వచ్చిన రాజులు కూడా 'శాతకర్ణి' అని తమ పేర్లలో చేర్చుకున్నారు.

***బనవాసి ప్రాముఖ్యత..***

బనవాసి (నేటి కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా) దక్షిణ భారతదేశంలోని అత్యంత పురాతన నగరాల్లో ఒకటి. ఇది కదంబ వంశానికి ముందు చుటులు మరియు ఆనంద వంశీయుల పాలనలో ఉండేది. మౌర్య చక్రవర్తి అశోకుడు ఇక్కడికి బౌద్ధ మత ప్రచారకులను పంపినట్లు ఆధారాలు ఉన్నాయి.

***ఈ నాణెం గురించి మీరు తెలుసుకోవాల్సిన ముఖ్య విషయాలు..***

ఈ నాణెం చాలా అరుదైంది. పైపేర్ వంటి ప్రఖ్యాత అంతర్జాతీయ నాణేల పుస్తకాలలో కూడా లేని నాణెం ఇది. పోతిన్ లోహంతో చేయబడింది. ఇది రాగి, సీసం, ఇతర లోహాల మిశ్రమం ఆ కాలంలో వెండి కొరత ఉన్నప్పుడు ఇలాంటి మిశ్రమ లోహాలను వాడేవారు. నాణెవం మీద బ్రాహ్మీ లిపిలో రాజ్ఞో బుద్ధానంద శాతకర్ణి అని స్పష్టంగా ఉంది. ఈ అరుదైన నాణేన్ని చూసి పురాతత్వ శాఖ అధికారులు, పురాతన నాణెముల సేకర్తలు, చరిత్రకారులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. రాయలసీమ కాయిన్స్ సొసైటీ సెక్రెటరీ. కానిస్టేబుల్ విష్ణు భగవాన్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

## కనేకల్ ప్రీమియర్ లీగ్ -2 క్రికెట్ విజేత ఓజి లెవెన్ జట్టు.. కాలవ భరత్ ..

**కనేకల్ (తెలుగోడు), మార్చి 22:**

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ అన్నారు. అన్నారు. గత నెల రోజులుగా కనేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పార్లమెంట్లో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడం వల్ల ఉన్న ఊరికి రాష్ట్రానికి దేశానికి సైతం సేవలు అందించిన వారమవుతామన్నారు. కాబట్టి యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కన్వర్చడం వల్ల స్పోర్ట్స్ కోటా కింద మంచి ఉద్యోగాల సైతం పొందవచ్చు అన్నారు. గత నెల రోజులుగా కనేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పార్లమెంట్లో

## క్రీడలు మానసిక ఉల్లాసం శారీరక ధారుఢ్యం పెంపొందిస్తాయి

ఆదివారం రోజు ఓ జి 11 జట్టు విజయం సాధించగా, రన్నర్సుగా కనేకల్ డైనమిక్ జట్టు,3వ స్థానంలో గేమ్ చేజర్స్ జట్టు విజేతలకు షీల్డ్, నగదు బహుమతిని కాలవ భరత్ అందించారు. మొదటి నగదు బహుమతిగా పదివేల రూపాయలు,రన్నర్ టీంకు రెండవ బహుమతి కప్ కింద ఐదు వేల రూపాయలు, మూడవ ప్రైజ్ కింద కప్,ప్రైజ్ మనీ 2500 నగదు బహుమతి ఇవ్వడం జరిగింది. కేపీఎల్ టు టోర్నీ యందు బెస్ట్ బౌలర్గా గణేష్ బెస్ట్ బ్యాట్స్మెన్ గా వినోద్ మాన్ అఫ్ ది మ్యాచ్ కుల్లాయ్ అవార్డులను అందుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సాధించిన కుల్లాయి కు సీనియర్ తెదేపా నాయకులు చంద్రశేఖర్ గుప్తా వెయ్యి రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతి కింద అందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు సీనియర్ నాయకుడు కలేకుర్తి లాలెప్ప, ఉప్పర సగర సంఘం చైర్మన్ ఆనంద్ రాజ్, ఆదర్శ బ్యాంక్ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్,నాగరాజు తిప్పేస్వామి, అనిల్ చౌదరి షేక్ ముజ్జు తదితరులు పాల్గొన్నారు.





విజేతలకు బహుమతి షీల్డ్, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్



శ్రీ సిద్దేశ్వర స్వామికి పూలతో అలంకరణ

# శ్రీ సిద్దేశ్వర స్వామికి విశేష పూజలు

**అమరాపురం (తెలుగోడు), మార్చి 22 :**
అతి పురాతనమైన శైవ క్షేత్రం హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సిద్దేశ్వర స్వామికి ఆదివారం విశేష పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం ,అభిషేకం, కుంకుమార్చన, పంచ అమృత అభిషేకం, వివిధ రకాల పూజలు అర్చకులు నిర్వహించారు. భక్తులు తెచ్చిన పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు వచ్చిన భక్తులకు అందజేశారు. కర్ణాటక ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు.

# ఉద్యోగం రాక మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 22 :**
ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన బత్తలపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, మండలంలోని సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన దేవరకొండ పెద్దబాబు (26) డిగ్రీ, టీటీసీ పూర్తి చేసి కొంతకాలంగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. అయితే ఉద్యోగం రాకపోవడం, అలాగే కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడటం వల్ల మానసికంగా కలత చెందాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వేరుశనగ నిల్వకు ఉపయోగించే పురుగుల మందు బిళ్లలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు . వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.మృతుని తండ్రి వెంకటనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



దేవరకొండ పెద్దబాబు (ఫైల్ ఫోటో)







ఉగాది సందేశమిస్తున్న ప్రధాన వక్త సర్వేశ్వరన్. పాల్గొన్న స్వయం సేవకులు

## హిందువులు కలిసికట్టుగా ఉండి

# మన ధర్మాన్ని, సంస్కృతిని , దేశాన్ని రక్షించుకోవాలి

## అమరాపురంలో ఉగాది ఉత్సవం.. స్వయం సేవకుల పథసంచలన్ ..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 22 :**
హిందువులు కలిసికట్టుగా ఉండి మన ధర్మాన్ని మన సంస్కృతిని మన దేశాన్ని రక్షించుకోవాలని పధాన వక్త సర్వేశ్వరన్ అన్నారు. అమరాపురం శ్రీ సరస్వతి విద్యా మందిరంలో ఆదివారం ఆర్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం నిర్వహించారు. తొలుత భారతమాత, డాక్టర్‌జీ, గురూజీ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి మండలంలో స్వయంసేవకులతో పథసంచలన్ నిర్వహిస్తున్నారన్నారరు. స్వయం సేవకులు సమాజం కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని నిత్యం ప్రజలను కలుస్తూ దేశం కోసం ఆలోచిస్తున్నారన్నారు. ఫలితంగా సమాజంలో సంఘటన నిర్మాణం జరుగుతతోందన్నారు. మన సంస్కృతిని పిల్లలకు బోధిస్తూ మనం ఆచరించాలని అన్నారు. మన పూర్వీకులు ఏ విధంగా సమాజం కోసం జీవించారో తెలుసుకోవాలన్నారు. వారి కృషి వల్ల మనం ఈరోజు సంతోషంగా జీవనం సాగిస్తున్నామన్నారు. కాబట్టి మనం మన పిల్లలకు మన సంప్రదాయాలు, విశేషాలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కలిసుంటే బలపడతాం, విడిపోతే పడిపోతాం"అనే సందేశాన్ని అందరు గుర్తుంచుకోవాలని అన్నారు. తొలుత గణవేష్ ధరించిన వందలాది మంది స్వయం సేవకులు గ్రామంలో పథసంచలన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకేష్, నాగభూషణం, లింగేష్, పూజారి శ్రీనివాస్, హేమావతి, బసవనపల్లి, హాలుకూరు, మందలపల్లి, గ్రామాల నుండి స్వయం సేవకులు పాల్గొన్నారు.



భరతమాత, చిత్రపటాలకు పూజ చేస్తున్న దృశ్యం



ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం.





అమరాపురం పట్టణంలో పథసంచలన్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో 24న నిరాహార దీక్ష

**రొళ్ల (తెలుగోడు), మార్చి 22 :**
ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న మడకశిర పట్టణంలో నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు యూటీఫ్ గౌరవ అధ్యక్షులు కె. భూతన్న తెలిపారు. ఈమెరకు ఆదివారం మడకశిర పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ సుబ్రమణ్యంకి యుటిఎఫ్ నాయకులు అనుమతి కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఆర్సి ఏర్పాటు, పెండింగ్ డి.ఏ.లు, బకాయిల చెల్లింపు, మెమో నెంబర్ 57 వర్తింపు, సీపీస్ రద్దు తదితర ఆర్థిక సమస్యల పరిష్కారం కొరకు యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు 2026 మార్చి 24వ తేదీ, మంగళవారం రోజున జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఒకరోజు నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కే. భూతన్న, జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప, మడకశిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.ఎన్. మాలింగప్ప వై. జోగప్ప మడకశిర తాలూకా సమన్వయకర్త టీ. మూడ్ల గిరియప్ప, గుడిబండ ప్రధాన కార్యదర్శి జి.ఎల్. కదురన్న, బి. నంజప్ప పి.ఓబన్న తెలిపారు.ఇందులో భాగంగా మడకశిర పట్టణంలోని ఎం ఆర్ ఓ కార్యాలయం ఎదుట మార్చి 24వ తేదీ, మంగళవారం రోజున నిర్వహించే ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమం కొరకు మడకశిర పట్టణ సిఐ శ్రీ సుబ్రమణ్యం కి మడకశిర యూటీఎఫ్ జోన్ పక్షాన వినతిపత్రం అందించారు.



సీఐకి వినతిపత్రం అందిస్తున్న యూటీఫ్ నాయకులు

పిఆర్సి కమీషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని, 29 శాతం ఐ.ఆర్. వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డి.ఏలు విడుదల చేయాలని, ఉద్యోగుల, పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని,హెల్త్ కార్డుల, మెడికల్ బిల్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కోవిడ్ సమయంలో మరణించిన 953 పంచాయతీ రాజ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# శ్రీ కొల్లాపూరి మహాలక్ష్మి దేవాలయం అభివృద్ధికి విరాళం

*50 వేలు అందించిన రంగాపురం గ్రామస్థులు ..*

**రొళ్ల (తెలుగోడు), మార్చి 22 :**
మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశం రత్నగిరిలో వెలసిన శ్రీ కొల్లాపురి మహాలక్ష్మి దేవాలయ అభివృద్ధికి ఆర్.రంగాపురం గ్రామస్థులు రూ.50,000లను విరాళంగా శనివారం రత్నగిరి దొర వంశస్థులైన రంగప్పరాజుకు అందజేశారు.ఇటీవల రంగాపురంలో జరిగిన కొల్లాపూరి మహాలక్ష్మి జ్యోతుల ఉత్సవాల్లో భాగంగా రంగప్పరాజు దేవాలయ నిర్మాణం లో భాగంగా ఆవరణంలో రేకులతో పైకప్పు వేయడానికి 4 లక్షలు అవుతాయాని గ్రామం తరపున తమవంతు సహకారం అందించాలని అభ్యర్థన మేరకు గ్రామస్థులు 50 వేల రూపాయలను పోగు చేసి విరాళంగా 50 వేల రూపాయలను దొర వంశస్థులు రంగప్పరాజు కు అందించారు.మిగిలిన 2,507 రూపాయలను కూచంగమ్మ దేవాలయ పనులకు ఉపయోగించుకున్నట్లు వారు తెలిపారు.దీనికి సహకరించిన దాతలకు గ్రామస్తులకు ఆలయ కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూరి మహాలక్ష్మి అమ్మవారు



ఆలయం అభివృద్ధికి విరాళం అందిస్తున్న రంగాపురం గ్రామస్థులు

# ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**
ఏపీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో శాశ్వత సభ్యులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం తాడేపల్లిలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు , ఏపీ జేఏసీ అమరావతి అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు ఎన్నికల అధికారిగా మరియు ఆంధ్రప్రదేశ్ నాలుగవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర వైస్ చైర్మన్ ఎస్ మల్లేశ్వరరావు గారు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన అధ్యక్షులు మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరైన నామినేషన్ ప్రక్రియలో కాకినాడ జిల్లాలో దేవాదాయ శాఖలో డ్రైవర్ పనిచేస్తున్న సంసాని శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఎన్నిక అనంతరం జరిగిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ , ఏపీ రెవెన్యూ సర్వీసెస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల్లో ఒక బలమైన సంఘంగా రాష్ట్ర జాయింట్ స్టార్ట్ కౌన్సిల్ శాశ్వత సభ్యులుగా ఉన్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సంఘటితంగా ఉండి ఏకగ్రీవంగా సంసాని శ్రీనివాసరావుని ఎన్నుకోవడం అభినందించదగ్గ విషయం అన్నారు.

ఏపీ జేఏసీ అమరావతికి రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కుడి భుజం లాంటిదని, మీ ప్రయోజనాలకోసం ఎల్లప్పుడూ మేము కలసి పనిచేస్తామని, అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాల కోసం మాతో పాటు డ్రైవర్ల సంఘం కూడా ఎప్పటిలాగే పనిచేయాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు రావల్సిన 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి (ఐ.ఆర్), డి.ఏ లు తదితర ఆర్థిక పరమైన అనేక అంశాలు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్నందున, రాష్ట్రంలో ఉన్న సోదర సంఘాలను కలుపుకొని పిఆర్సి కమిషనర్ ని నియమించి , ఐ అర్., పెండింగ్ డి.ఏ లు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరబోతున్నామని తెలియచేశారు.

ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఏపీ జేఏసీ అమరావతి సహా చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు మాట్లాడుతూ అన్ని జిల్లాల అధ్యక్షులు వారి వారి జిల్లా సభ్యులతో ఎన్నికల్లో పాల్గొని ఎలాంటి ఇబ్బందులు కలుగజేయకుండా మంచి వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించినందుకు అన్ని జిల్లాల నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, గతంలో మాదిరి ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకత్వం ఏపీ జేఏసీ అమరావతి తో కలిసి పని చేసి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశానికి లేబర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి కిషోర్ కుమార్ , గ్రామ వార్డు సచివాలయాలు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి అర్లయ్య గారు, ఏపీజేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బత్తిన రామకృష్ణ తదితరులు అతిథులుగా హాజరయ్యారు.



# వడిగేపల్లిలో కాఫీ విత్ క్యాడర్

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 22 :**
గోరంట్ల మండల కేంద్రంలోని వడిగేపల్లి గ్రామంలో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రవమాన్ని మాజీమంత్రి, వైకాపా శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఉషశ్రీ చరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గామ ప్రజలను ఆమె పలకరించారు. గోరంట్ల మండల కేంద్రంలోని వడిగేపల్లి పంచాయతీలోని వడిగేపల్లి గ్రామం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి గడపగడపకు వెల్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ, నాడు జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలకు ఏ లోటు లేకుండా ప్రతి కుటుంబానికి ప్రతి ఏడాది సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు, ఇప్పుడున్న ఈ కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్య పెట్టే విధంగా లేనిపోని హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలను తీవ్రంగా అన్యాయం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు వడిగేపల్లి పంచాయితీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..





నూజివీడులో మంత్రులు సవిత, కొలుసు పార్థసారథికు స్వాగతం పలుకుతున్న నాయకులు

# రాష్ట్రంలో ప్రతిరోజూ పండుగే

## అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యం నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరణ.. మంత్రులు సవిత, కొలుసు పార్థసారథి..

**నూజివీడు/ఏలూరు (తెలుగోడు), మార్చి 22 :**
సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతి రోజూ పండగేనని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆనందం వెలిబుచ్చారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వడ్డెర్లను ఎస్టీలో చేర్చే విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఆదివారం జరిగిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బ్రిటీషర్ల దాష్టీకాలను ఎదిరించి... మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఓబన్న చేసిన పోరాటాన్ని ముందు తరాలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. దీనిలో భాగంగా ఓబన్న జయంతిని అధికారికంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించాలని శాశ్వత జీవో జారీచేశారన్నారు. గత సంవత్సరం గుంటూరులో, ఈ ఏడాది అనంతపురంలో ఓబన్న జయంతిని అధికారికంగా జరుపుకున్నామన్నారు. నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరించడం అభినందనీయమని మంత్రి సవిత కొనియాడారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. ఉగాది సందర్భంగా నిరుద్యోగ యువతకు మంత్రి నారా లోకేశ్ శుభవార్త చెబుతూ, జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పథకాలతో ఎక్కువగా లబ్ధి పొందేది బీసీలేనని మంత్రి స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతి రోజూ పండుగ వాతావరణమే ఉంటోందన్నారు. బీసీలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వాలవేనన్నారు. బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే ఈ చట్టాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు కేబినెట్ లో ఎనిమిది మంది బీసీ మంత్రులకు కీలక శాఖలు అప్పగించారన్నారు. కేంద్రమంత్రిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కింజరాపు రామ్మోహననాయుడికి అవకాశమిచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

వడ్డెర్ల సామాజిక వర్గీయులకు అన్నివిధాలా సీఎం చంద్రబాబు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం రాయితీ కల్పించామన్నారు. వడ్డెరలకు మైనింగ్ లీజు రిజర్వేషన్లు రద్దు చేసిన ఘనుడు జగన్ అని విమర్శించారు. వడ్డెర్లను ఎస్టీలో చేర్చే విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

అనంతరం తనను కలిసిన విలేకర్లతో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభ్యున్నతి కోసం అన్న ఎన్టీఆర్ విశేష కృషి చేశారన్నారు. బీసీలకు సీఎం చంద్రబాబు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితమయ్యాయన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి శభాష్ అనిపించుకున్న మంత్రి నారా లోకేశ్ త్వరలో మరో డీఎస్సీ నిర్వహించడానికి సిద్ధమవుతున్నారన్నారు. మహిళల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దీపం 2, స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి ఎన్నో పథకాలు అమలుచేసి, మహిళా పక్షపాతినని సీఎం చంద్రబాబునాయుడు నిరూపించుకున్నారన్నారు. జగన్ మాత్రం అందుకు విరుద్ధంగా ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని మంత్రి సవిత మండిపడ్డారు. అంతకుముందు నూజివీడుకు వచ్చిన మంత్రి సవితకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ ర్యాలీ నిర్వహించి, గజమాలతో సత్కరించి అడుగడుగునా బ్రహ్మరథం పట్టాయి.

మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి స్వాతంత్ర సమర యోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఈశ్వరరావు, డైరెక్టర్లు, ఉమ్మడి కృష్ణా జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వడ్డెర సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రులు సవిత, కొలుసు పార్థసారథి

# పేద విద్యార్థుల ఆకలిని అవమానించొద్దు

**మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి వ్యాఖ్యలకు బీఎస్పీ ఆగ్రహం**

**బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 22 :**
మధ్యాహ్న భోజన పథకంపై ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలను ఆదివారం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుడిపి సామేలు తీవ్రంగా ఖండించారు. పేద విద్యార్థుల ఆకలి సమస్యను అవహేళన చేసేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకం ఏ ఒక్క ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వాధినేత వారి సొంత డబ్బులతో అమలు చేయబడేది కాదని స్పష్టం చేశారు. దేశ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే ఈ పథకం కొనసాగుతోందని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు చెల్లించే పన్నులు కూడా ఇందులో భాగమని తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పేద విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంపై ఆధారపడి పాఠశాలలకు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆకలితో ఉన్న విద్యార్థికి చదువు సరిగ్గా అర్థం కావడం కష్టమని, ఈ పథకం వల్ల పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ శాతం గణనీయంగా తగ్గిందని, అలాగే పేద పిల్లల ఆరోగ్యం మెరుగుపడిందని వివరించారు. పట్టువస్త్రాలు, సన్మానాల మధ్య జీవితం గడిపే వారికి సాధారణ ప్రజల కష్టం అర్థం కాకపోవచ్చుని, కానీ పేదల జీవితాలపై వ్యంగ్యంగా మాట్లాడటం సమాజానికి మంచిదికాదని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత అంటే తోటి మనిషి బాధను అర్థం చేసుకోవడం, ఆకలిని గౌరవించడం గానీ అవహేళన చేయడం కాదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేయాలని లేదా దానిపై వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. విద్య మరియు పౌష్టికాహారం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులని, ఈ పథకం ద్వారా బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్య అందుబాటులోకి వస్తోందని తెలిపారు. అందువల్ల గరికపాటి నరసింహారావు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఎస్పీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా బహుజన విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత బలోపేతం చేసి పేద విద్యార్థులకు పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.





టిప్పర్లను అడ్డుకొని ధర్నా నిర్వహిస్తున్న రైతులు

# సుండుపల్లి ఇసుక క్వారీ రద్దుచేయాలి

**ఇసుక క్వారీ వద్ద ధర్నా..**

**టి. సుండుపల్లి (తెలుగోడు), మార్చి 22 :**
సుండుపల్లె పరివాహక ప్రాంతాల రైతులకు నీటి కరువు ఏర్పడేలా చేస్తున్న సుండుపల్లె ఎర్రమనేని పాలెం వద్ద ఉన్న ఇసుక క్వారీని రద్దుచేసి తమ ప్రాంత రైతులను కాపాడాలని టి సుండుపల్లె గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎర్రమనేనిపాలెం కుప్పగుట్ట వద్ద ఉన్న క్వారీ వద్దకు క్వారీ వద్దకు బహుద ఆయకట్టు రైతులు చేరుకొని మైనింగ్ చేస్తున్న యంత్రాలను, తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకొని ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా కూడా పట్టించుకోవడం లేదు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి రిచ్ ను రద్దు చేసేలా చూడాలన్నారు. అనుమతులకు మించి ఇసుక దందా జరుగుతోందని వెంటనే అరికట్టాలని, ఇసుక తరలిస్తున్న వాహనాలతో పాటు భారీ యంత్రాలను నది నుండి బయటికి పంపించారు.



శంకరయ్య నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగన్మోహన్ రాజు

# శంకరయ్య నాయుడు చిత్రపటానికి నివాళి

**టి. సుండుపల్లి (తెలుగోడు), మార్చి 22 :**
మాలేపాటి శంకరయ్య నాయుడు చిత్రపటానికి టిడిపి రాజంపేట నియోజకవర్గం ఇంచార్జ్ చామర్తి జగన్మోహన్ రాజు నివాళులు అర్పించారు. ఆదివారం శంకరయ్య నాయుడు దశదినకర్మ కాండ సందర్భంగా టిడిపి నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ , మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, సింగల్ విండో డైరెక్టర్ సురేష్ నాయుడు,తిమ్మసముద్రం గ్రామా అధ్యక్షుడు శివయ్య, రాయవరం గ్రామా అధ్యక్షులు రామ్ నారాయణ ,సీనియర్ నాయకులు రాజగోపాల్ నాయుడు, వేములయ్య, మోహన్ నాయుడు, మైనారిటీ నాయకుడు సిద్ధిక్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో తొలి సెమీకండక్టర్ ప్రాజెక్టు విశాఖకు గ్రీన్ సిగ్నల్

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**
ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీ రంగం అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. విశాఖపట్నంలో భారీ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎస్ఐపీ) సంస్థ ఈ యూనిట్‌ను స్థాపించనుండగా, ఇందుకోసం మొత్తం రూ.2,387.81 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు కోసం విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 30 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 2024--29 కింద ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఎకరా భూమిని కేవలం ఒక్క రూపాయికే కేటాయించారు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. మొదటి దశలో రూ.547.09 కోట్లు, రెండో దశ విస్తరణకు సుమారు రూ.1,840 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశ పనులను 2027 జులై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వ 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' (ఐఎస్ఎం) కింద ఆంధ్రప్రదేశ్‌లో అనుమతి పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ఈ యూనిట్ ఏర్పాటుకు దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఏసీటీ కో లిమిటెడ్) సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. రెండో దశలో డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అప్లికేషన్ల కోసం అవసరమైన అత్యాధునిక ప్యాకేజింగ్ టెక్నాలజీపై దృష్టి సారించనున్నారు. ఈ భారీ పరిశ్రమ రాకతో విశాఖ నగరం దేశీయ సెమీకండక్టర్ పటంలో కీలక స్థానాన్ని సంపాదించుకోనుంది.



# ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

**దివ్యాంగుల జీవితంలో వెలుగు నింపిన కూటమి.ప్రభుత్వం రాష్ట్ర దివ్యాంగుల కార్పోరేషన్ చైర్మన్ జి నారాయణ స్వామి..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 22 :**
ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని రాష్ట్ర దివ్యాంగుల కార్పోరేషన్ చైర్మన్ జి నారాయణ స్వామి అన్నారు. దివ్యాంగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగు నింపిందన్నారు. డోన్ లో రాష్ట్ర "దివ్యాంగుల సాధికారత ఫోరం"(డిఈఎఫ్) అధ్యక్షులు బి సి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. శివశంకర్, కోశాధికారి ఆదిశేషయ్య , డిఈఎఫ్ కార్యవర్గ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ దివ్యాంగుల సంక్షేమ శాఖ, కార్పోరేషన్ చైర్మన్ నారాయణ స్వామి. ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ కార్యవర్గం దివ్యాంగులకు సంబంధించిన పలు సామాజిక సంక్షేమాభివృద్ధి పథకాలు అమలు, బడ్జెట్ కేటాయింపు, హక్కులు, రాయితీ, రిజర్వేషన్లు కొనసాగింపు, ఉపాధి, మౌలిక వసతులు, సదుపాయాలు కల్పన మొదలైన ఎన్నో అంశాలపై చర్చిస్తు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆయనకు "వినతిపత్రం" (మెమోరాండం) ఇవ్వడం జరిగింది, అనంతరం ఆయన మాట్లాడుతూ ఖచ్చితంగా డిఈఎఫ్ అధ్యక్షులు, కార్యకర్తలు నాకు తెలియజేసిన డిమాండ్లను అన్నింటినీ ప్రతి అంశాన్ని ప్రజా ప్రభుత్వ ప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి డిఈఎఫ్ కార్యవర్గ సభ్యులు బాల కుళ్ళాయమ్మ, వాసు దేవుడు, బాలకృష్ణ, వెంకటేష్, పెద్దన్న, రవి కుమార్, రామకృష్ణ, వెంకటేష్ ఆచారి, ఎర్రిస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర దివ్యాంగుల కార్పోరేషన్ చైర్మన్ జి నారాయణ స్వామి



సమావేశమైన రాష్ట్ర దివ్యాంగుల కార్పోరేషన్ నాయకులు

# మద్యం తాగి వాహనాలు నడపవద్దు

**ఎస్ఐ మారుతి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 22 :**
మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని పెద్దకడబూరు ఎస్ఐ మారుతి హితవు పలికారు. ఆదివారం పెద్దకడబూరు మండల పరిధిలోని కంబళదిన్నె గ్రామ శివారులో కోసిగి రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించి వాహనదారులను ఆపి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మారుతి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. కేవలం వాహనదారుల ప్రాణాలే కాకుండా ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని ఆయన సూచించారు. వేగ పరిమితులను పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రత కోసం పోలీసు శాఖ తరచూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మారుతి స్పష్టం చేశారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ మారుతి

# రౌడీషీటర్లు బాధ్యతాయుతంగా నడుచుకోవాలి

**రౌడీషీటర్లకు కౌన్సెలింగ్.. సీఐ నగేష్ బాబు ..**

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 22 :**
సమాజంలో మీ కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సిఐ. నగేష్ బాబు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ, సంఘ వ్యతిరేక కార్యక్రమాలు,జరిగినా మొదటగా మిమ్మల్ని అనుమానాల్సిన పరిస్థితి ఉంటుంద ని అందుకే మీరు మీ గ్రామ పరిధిలలో ఎలాంటి సంఘటన జరిగిన పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని అన్నారు. అలాగే ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ, మీరు ఉన్నట్లు తెలిసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మీరు తెలిసో తెలియకో చేసిన తప్పులను మీరే సర్దుకుంటూ, ఎలాంటి రాజకీయ పలోభాలకు లోను కాకుండా మీ కుటుంబాన్ని బాధ్యతాయుతంగా అభివృద్ధి చేసుకొని మంచి ప్రవర్తనతో నడుచుకుంటూ మాకు మీరు మారారు అని పరోక్షంగా ప్రత్యక్షంగా మేము తెలుసుకున్నప్పుడు మీ రౌడీ షీటర్ సీట్ తొలగించేందుకు పై అధికారులకు సమాచారం తెలిపి మే ప్రవర్తనలో మార్పు వచ్చిందని తెలియపరుస్తామన్నారు. అలాంటి మీలో మంచి ప్రవర్తన వచ్చిందని మాకు నమ్మకం, కలిగేటట్లు మీలో మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. అలా మార్పు వచ్చిన వారి పై అధికారులు సమాచారం ఇచ్చి సత్ప్రవర్తన కలిగి ఉన్నారని వారి పేరును, ఉన్నతాధికారులకు పంపిస్తూ వారి పేరును రౌడీ షీటర్ నుండి తొలగించడానికి ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నగేష్ బాబు

# శ్రీ భక్త కనకదాస కల్యాణ మండప నిర్మాణ పనుల పరిశీలన

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 22 :**
రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లిలో ఎంపీ నిధులు 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న శ్రీ భక్త కనకదాస కల్యాణ మండప నిర్మాణ పనులను హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికే పార్థసారధి , ఎమ్మెల్యే సునీత, కాంట్రాక్టర్ పోతులయ్య పరిశీలించారు. వారి వెంట లక్ష్మీనారాయణ కనగానపల్లి ఎంపీటీసీ భాస్కర్ గ్రామస్తులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపి బికే పార్థసారధి



ఎంపి బికే పార్థసారధికి స్వాగతం పలుకుతున్న నేతలు

## నూతన సబ్ స్టేషన్ ప్రారంభం

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 22 :**
రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో సీసీ రోడు, 33/11ఖఎ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారధి , రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు. వారిని నాయకులు ఘన స్వాగతం పలికారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు



# నేడు మోస్తరు వర్షాలు

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**
ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సోమవారం పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం,అల్లూరి, పోలవరం,విశాఖ, అనకాపల్లి,కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు,కృష్ణా,ఎన్టీఆర్, గుంటూరు అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అలాగే బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసేటపుడు పొలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని పేర్కొంది. ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని సూచించింది.



# ఏప్రిల్‌లో జేఈఈ మెయిన్ (సెషన్-2) పరీక్ష

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**
జేఈఈ మెయిన్‌సెషన్-2 పరీక్షలకు కచ్చితమైన తేదీలను ఎన్‌టీఏ ఆదివారం ప్రకటించింది. ఈ పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పులను సైతం అందుబాటులో ఉంచింది. ఏప్రిల్ 2, 4, 5, 6, 8 తేదీల్లో జేఈఈ మెయిన్ (సెషన్-2) పేపర్-1 పరీక్షలు జరుగుతాయని ఎన్టీఏ స్పష్టం చేసింది. అలాగే, ఏప్రిల్ 7న పేపర్ 2ఎ (బీఆర్క్) పేపర్ 2బి (బి. ప్లానింగ్), పేపర్ 2ఎ, 2బి (బీఆర్క్, బి. ప్లానింగ్ రెండింటిని కలిపి) ఉంచారు. జేఈఈ మెయిన్ సెషన్- 2 పరీక్షలు దేశవ్యాప్తంగా నగరాల్లో, విదేశాల్లోని 15 నగరాల్లో నిర్వహించడం జరిగింది ఎన్టీఏ డైరెక్టర్ (ఎగ్జామ్స్) ఓ ప్రకటనలో. ఎగ్జామ్ ఇంటిమేషన్ స్లిప్పుల డౌన్లోడ్లో ఎదురయ్యే ఇబ్బందులు 011-40759000 అభ్యర్థులు నంబర్కు లేదా యవవమ్ఝఉఅఏఖ్ఝ. ఖఎ. ఆఅ సిటీమ్ ద్వారా సంప్రదించడానికి సిఫార్సు చేసింది.



# నేడు స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**అమరావతి (తెలుగోడు), మార్చి 22 :**
అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో 'ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్' ఉక్కు కర్మాగారానికి మార్చి 23న భూమిపూజ జరగనుంది. సీఎం నారా చంద్రబాబు, కేంద్ర మంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష మందికి ఉపాధి లభించనుంది. ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంగా ఉత్తరాంధ్ర పారిశ్రామిక రూపురేఖలు మారనున్నాయి.



# అయ్యప్ప భక్తుడిగా మాస్ మహారాజ్

## మల్లెపూల పల్లకి రీమిక్స్‌తో సందడి




సంక్రాంతి బరిలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన మాస్ మహారాజ్ ఇప్పుడు మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చే దర్శకుడు తెరకెక్కిస్తున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్రలో కనిపించనుంది.

ఈ సినిమాలో మాస్ మహారాజ్ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్నారని సమాచారం. ఆధ్యాత్మికతతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్‌ను మిళితం చేస్తూ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇదిలా ఉండగా, అయ్యప్ప భజనల్లో ప్రసిద్ధి చెందిన 'మల్లెపూల పల్లకి.. బంగారు పల్లకి మణికంఠుడు ఎక్కినాడు' పాటను రీమిక్స్ చేయాలన్న ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఈ విషయంపై సంగీత దర్శకుడు స్పందిస్తూ, ఆ పాటను రీమిక్స్ చేయాలని అభిమానులు కోరుతున్నారని, అయితే తుది నిర్ణయం మాత్రం దర్శకనిర్మాతలదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. భక్తి, భావోద్వేగం, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికగా ఈ సినిమా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# సినీరంగం వెలుగు వెనుక ఒంటరితనం



సినీ పరిశ్రమ బయటికి ఎంత గ్లామర్‌గా కనిపిస్తుందో, లోపల అంత ఒంటరితనం ఉంటుందని హీరోయిన్ రాశి ఖన్నా పేర్కొన్నారు. సినిమా పూర్తయ్యాక ప్రతి ఒక్కరూ తమ తమ దారులు చూసుకుంటారని, నిజమైన స్నేహాలు ఏర్పడటం చాలా అరుదని ఆమె భావోద్వేగంగా చెప్పారు. తాజాగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె, ఈసారి మాస్ ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

సినిమాలను థియేటర్లలో చూసే అనుభవం తనకు ఎంతో ఇష్టమని, ప్రేక్షకుల స్పందనను ప్రత్యక్షంగా గమనించడం ఒక నటిగా తనకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తుందని చెప్పారు. ప్రేక్షకులు ఏ సన్నివేశానికి ఎలా స్పందిస్తారో చూడటం ద్వారా నటనలో మరింత మెరుగుదల సాధించగలమని ఆమె అభిప్రాయపడ్డారు. అవకాశం దొరికితే తప్పకుండా థియేటర్‌కే వెళ్లేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.జీవితంలో చదువు, కెరీర్ ఎంత ముఖ్యమో ఆధ్యాత్మిక విలువలు కూడా అంతే అవసరమని ఆమె నమ్మకం వ్యక్తం చేశారు. కష్టకాలంలో మనసుకు ధైర్యం ఇవ్వడం, మనల్ని మనం అర్థం చేసుకోవడంలో ఆధ్యాత్మిక ఆలోచనలు సహాయపడతాయని చెప్పారు. ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలు మాత్రమే కాకుండా జీవితం గురించి లోతుగా తెలుసుకోవడమని వివరించారు.దర్శకుడు హరీష్ శంకర్ ఫోన్ చేసి పవన్ కళ్యాణ్తో సినిమా ఉందని చెప్పగానే మరో ఆలోచన లేకుండా అంగీకరించానని ఆమె వెల్లడించారు. తన కెరీర్‌లో తొలిసారి కథ వినకుండానే ఓకే చెప్పిన సినిమా ఇదేనని చెప్పారు. సినీ రంగంలోకి వచ్చినప్పటి నుంచి ఆయనతో కలిసి పని చేయాలనే కోరిక ఉండేదని, ఆ అవకాశం దక్కడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పదని, ఆయనతో కలిసి పని చేసిన తర్వాత మరింతగా అర్థమైందని తెలిపారు.తనకు స్ట్రీట్ ఫుడ్ అంటే ఎంతో ఇష్టమని, ఎక్కడికి వెళ్లినా ఆ ప్రాంతానికి ప్రత్యేకమైన వంటకాలను తప్పకుండా రుచి చూస్తానని చెప్పారు. తాను వెజిటేరియన్ కావడంతో ప్రతి ఐటమ్ వెజ్ అయిందో లేదో ముందుగా పరిశీలిస్తానని, బయట తినేటప్పుడు పరిశుభ్రతను కూడా ముఖ్యంగా చూసుకుంటానని వివరించారు.స్కూల్ రోజులే మనలో క్రమశిక్షణ, విలువలు, బాధ్యతను పెంచే ముఖ్యమైన దశ అని ఆమె గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి క్రమబద్ధమైన అలవాట్లు ఇప్పుడు తన జీవితాన్ని సక్రమంగా నడిపించడంలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అప్పట్లో టీచర్లు చెప్పిమాటలు ఇప్పుడు జీవితానికి దారిదీపాలుగా మారాయని చెప్పారు.సినీ ప్రయాణం కేవలం నటనతో ముగియదని, ఒంటరితనాన్ని తట్టుకుని ముందుకు సాగగల బలమైన మనస్తత్వం అవసరమని ఆమె అన్నారు. ప్రతి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోగలిగితేనే ఈ రంగంలో నిలబడగలమని పేర్కొన్నారు.

# గ్లామర్‌కు మించిన సారా అలీ ఆత్మవిశ్వాసం

రాజవంశపు నేపథ్యం, బాలీవుడ్ గ్లామర్---ఇవి రెండూ కలిసిన వ్యక్తిత్వం సారా అలీ ఖాన్. కానీ ఈ రెండు పరిధులను దాటి తనదైన ఆలోచనలతో ముందుకు సాగుతున్న ఆధునిక యువతిగా ఆమె గుర్తింపు పొందుతున్నారు. వివాదాలు చుట్టుముట్టినా, విమర్శలు ఎదురైనా తన శైలిలో సమాధానాలు ఇస్తూ ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తున్నారు ఈ పటౌడీ వంశానికి చెందిన కథానాయిక.వారసత్వంతో చిత్రసీమలో అడుగుపెట్టడం ఒక అవకాశం మాత్రమే. అయితే ఆ వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించడం మాత్రం సవాలే. తల్లి అమృతా సింగ్ గంభీరత, తండ్రి సైఫ్ అలీ ఖాన్ వాక్చాతుర్యం కలగలిసిన వ్యక్తిత్వంతో సారా అలీ ఖాన్ నేటి తరం కథానాయికల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. తెరపై గ్లామర్‌తో ఆకట్టుకునే ఆమె, నిజజీవితంలో మాత్రం స్పష్టమైన అభిప్రాయాలతో ముందుకు సాగే యువతిగా నిలుస్తున్నారు.ఇటీవల ఆమె చుట్టూ చెలరేగిన వివాదాలు కూడా ఇదే విషయాన్ని మరోసారి చాటుతున్నాయి. గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో సారా పేరు మార్మోగుతోంది. దీనికి కారణం ఆమె సినిమాలు కాదు, ఆమె ఆధ్యాత్మిక విశ్వాసాలే. కేదార్‌నాథ్ ఆలయానికి తరచూ వెళ్లే ఆమె భక్తి గురించి అందరికీ తెలిసిందే. అయితే ఉత్తరాఖండ్‌లో ఆలయ దర్శనానికి సంబంధించి కొన్ని నిబంధనలపై వస్తున్న చర్చల నేపథ్యంలో, హిందూయేతరుల ప్రవేశంపై ప్రతిపాదనలు వెలువడటం వివాదానికి దారి తీసింది.ఈ నేపథ్యంలో సారా గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. "నేను ఎక్కడికి వెళ్లినా నా మనసులో ఉన్న భక్తి ముఖ్యం. దేవాలయాలకు వెళ్లడం నాకు మానసిక ప్రశాంతతను ఇస్తుంది. అది నా వ్యక్తిగత ఆధ్యాత్మిక ప్రయాణం" అంటూ ఆమె చెప్పిన అభిప్రాయం విస్తృతంగా పంచుకుంటున్నారు. విమర్శలు వచ్చినా, వివాదాలు చెలరేగినా తన నమ్మకాలపై నిలబడే ధైర్యం, వాటిని హుందాగా వ్యక్తపరచే తీరు ఆమె పరిణితిని స్పష్టంగా చూపిస్తోంది.గ్లామర్ ప్రపంచంలో ఎదుగుతున్న అనేక మంది నటీమణుల్లో సారా అలీ ఖాన్ ప్రత్యేకత ఇదే. వారసత్వం మాత్రమే కాదు, వ్యక్తిత్వంతోనూ నిలబడగల నటి అని మరోసారి నిరూపిస్తున్నారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.